క్లుప్తంగా

పుస్తెమెట్టెల అందజేత



యువతి కుటుంబానికి పుస్తెమెట్టెలు అందజేస్తున్న దాత

కేశంపేట: మండల పరిధి పాపిరెడ్డిగూడ గ్రామం నిరుపేద కుటుంబమైన అబ్బి సుగుణ–మల్లయ్య దంపతుల కుమార్తె కీర్తన వివాహానికి శుక్రవారం గ్రామానికి చెందిన పల్లాటి కవిత– లక్ష్మీనారాయణ దంపతులు పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, శ్రీనివాస్, సిల్వేరు రవీందర్, శ్రీశైలంగౌడ్, గుండు రామకృష్ణ, అల్వాల రవి, రామస్వామి, చంద్రయ్య, రవీందర్ పాల్గొన్నారు.

పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి



అమ్డాపూర్‌లో ఆవులకు టీకా వేస్తున్న వైద్యురాలు దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు ఆర్థికాభివృద్ధి చెందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి నదీమ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. వేసవిలో పశువులను జాగ్రత్తగా కాపాడుకుంటే ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గుతుందని, మూగ జీవాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో అధికంగా నీటిని అందించాలని, మధ్యాహ్నం వాటిని నీడలో ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్ రవి, రైతులు, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడొద్దు

షాద్‌నగర్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్టలో కిషన్‌నాయక్, లింగం నాయక్, రమేష్ నాయక్ ఆధ్వర్యంలో చౌడమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేసి మాట్లాడారు. హిందు ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతుండంతో దేశ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. దేశ భక్తి, జాతీయ భావాలను సమాజంలో వ్యాపింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ అప్ప, శ్రీను నాయక్, రాజ్‌కుమార్, రవి, లచ్చిరాం, రాజు నాయక్, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రమేష్



పూజా కార్యక్రమంలో నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేష్ అన్నారు. చైత్ర మాసం శుక్రవారం పురస్కరించుకొని సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్‌లు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంసాని శ్రీనివాస్, పెద్ది రాంమోహన్, పోల శశిధర్, తాటి నారాయణమూర్తి, సాగర్, కోటిలింగం, అశోక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, రఘునాథ్ యాదవ్, అనిత, కల్వ మురళి, అర్చకులు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో చామంతి పూల తోట



ఎర్రోనిగూడ గ్రామంలో జర్మన్ పూల తోట

చామంతి.. లాభసాటి

సిరులు కురిపించే పుష్పాలు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- సాగుకు సన్నద్ధం

షాబాద్: చామంతి పూలసాగుకు సమయం రానే వచ్చింది. ఈ పుష్పాలకు సహజంగానే మార్కెట్లో డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం వివాహాలు, పండుగల కాలం కావడంతో విక్రయాలు అధికంగా ఉంటాయి. డిమాండ్‌తో పాటు.. లాభాలు అధికంగా ఉండటంతో పూల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పొలాలను సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

ఆరు నెలలకు దిగుబడి

ఏటా వందలాది ఎకరాల్లో చామంతి, బంతిపూలను సాగు చేస్తుంటారు. అయితే రైతులు ఎక్కువగా చామంతి సాగుకే మక్కువ చూపుతున్నారు. ఒక్కోరైతు కనీసం రెండు నుంచి మూడెకరాలకు తగ్గకుండా నాలుగు రకాల చామంతి పూలను సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఇదిలా ఉండగా.. చామంతి సాగు జూన్, జూలై నెలలోనే సాగవుతుంది. ఆరు నెలలకు దిగుబడులు వస్తాయి. ఆ సమయంలో కార్తీకమాసం సహా పండుగలు, పెళ్లిళ్లు వరుసగా వస్తుండడంతో పూలకు గిరాకి ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

70 ఎకరాల్లో సాగు..

షాబాద్ మండలంలోని అంతారం, రుద్రారం, సోలిపేట్, మద్దూర్, మాచన్‌పల్లి, పోలారం, పోతుగల్, చర్లగూడ, ఎల్గోండగూడ, చందనవెల్లి, తిర్మలాపూర్, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో కనీసం 50 నుంచి 70 ఎకరాల్లో సాగు చేస్తారు. అందులో తెలుపు, క్యారెట్, పేపర్‌వైట్, పసుపు, వంగపూత, ఎగ్‌వైట్ తదితర రకాలను పండిస్తారు. ఇక్కడి రైతులు ఆంధ్రప్రదేశ్, బెంగళూరు తదితర ప్రాంత్రాల నుంచి మొక్కలను దిగుమతి చేసుకుంటారు. ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.1 నుంచి రూ.3 వరకు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో చామంతి సాగుకు రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. రెండు నెలల పాటు వారంలో రెండు కోతలు దిగుబడులు వస్తాయి. పంటకాలం పూర్తయ్యేలోగా ఎకరాకు దాదాపు 8 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. పండగల సమయంలో దాదాపు కేజీ చామంతి పూలు రకాన్ని బట్టి 70 నుంచి రూ.120 వరకు ఉంటుంది.

మూడెకరాల్లో సాగు



ఏటాలాగే ఈసారి చామంతిని సాగు చేద్దామని అనుకుంటున్నాం. అందులో వైట్, రెడ్, వంగపూత రకాల సాగు చేస్తాను. పెళ్లిళ్ల సీజన్‌లో చామంతికి మంచి డిమాండ్ ఉంటుంది. ముందునుంచే పూల సాగుకు పొలం సిద్ధం చేస్తున్నాం. – దాదె అమృత్‌రాజ్ రైతు, సర్దార్‌నగర్

క్రమం తప్పకుండా చామంతి సాగు



ప్రస్తుతం రెండు ఎకరాల్లో నాలుగు రకాల పూలు సాగు చేస్తున్న. దిగుబడి వచ్చే సమయానికి వివాహాలు, పండుగలు వస్తాయి. ఆ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. కూరగాయలతో పాటు పూలసాగు చేస్తున్నాం. – సామ ప్రతాప్‌రెడ్డి రైతు, ఎర్రోనిగూడ

వీర జవాన్‌కు అశ్రునివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న గిరిజన నాయకులు

లంబడాల కొవ్వొత్తుల ర్యాలీ

షాద్‌నగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ త్యాగం వెలకట్టలేనిదని లంబడాల హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. జవాన్ మృతికి నివాళిగా శుక్రవారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో భారీగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ పై జరుగుతున్న పోరాటంలో ఏపీలోని గిరిజన కుటుంబానికి చెందిన మురళీ నాయక్ మృతి ఎంతో బాధాకరమన్నారు. యుద్ధ భూమిలో ఉగ్రవాదులను హత మార్చడంలో మురళీ పోరాటం ఎనలేనిదని కొనియాడారు. ఆయన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురళీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు నాయక్, లక్ష్మణ్ నాయక్, వర్త్య నాయక్, బద్రి నాయక్, అయోధ్య శ్రీనివాస్, చందర్ నాయక్, పరశరాం, అంబదాస్, చందర్ నాయక్, రాజేష్ నాయక్, వినోద్ నాయక్, రమేష్, వెంకట్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజేందర్, రవీందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

- అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి
- పాఠశాల విద్యా కమిషనర్‌ను కలిసిన సభ్యులు

మంచాల: ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎస్‌ఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో కలిసి శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆరుట్ల స్కూల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఇప్పటికే రూ.60 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. స్కూల్‌కు మరో ఆరు గదులు అవసరమని తెలిపారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజషా,ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, నూకం రాజుముదిరాజ్, ఎం.డీ. జానీపాషా, చిందం శ్రీశైలం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై కూటమి సర్కార్ కక్షసాధింపు

షాద్‌నగర్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తున్న పాత్రికేయులపై ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మఫిషియల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన మాట్లాడారు. అవినీతి అక్రమాలను వెలికి తీయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మంచిదికాదని హితవు పలికారు.



షాద్‌నగర్: శ్రీనివాస్



కొందుర్గు: జయ

పత్రికా స్వేచ్ఛపై దాడి

కొందుర్గు: పాత్రికేయులపై దాడి చేసి, పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదని బీసీసేనా జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షురాలు ప్యాట జయ అన్నారు. ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడిచేయడాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేయడమేనని పేర్కొన్నారు. ఎవరైనా తప్పుచేస్తే పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఇలా ఏకంగా ఇళ్లల్లోకి చొరబడటం ఏమిటని ప్రశ్నించారు. ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించండి

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్‌చలో- బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్‌లో బీసీ కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. బీసీ కులగణన, దేశ రక్షణలో భాగంగా పాక్ తీవ్రవాదులపై సిందూర్ ఆపరేషన్ వంటి సాహసోపేతమైన నిర్ణయాలు దేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, కుర్మయ్య, ప్రశాంత్, రఘుగౌడ్, లింగం, కృష్ణ, మధు, మహేశ్, యాదయ్య, శ్రీశైలం, శివ, కరుణాకర్, రమేష్, జంగయ్య, దేవదయాళ్, చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

పనిచేసేవారికే ప్రాధాన్యత

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికే అన్ని పదవులు వస్తున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల వారికి ఇందిరమ్మ కమిటీలు తదితర పదవులు దక్కుతున్నాయని పార్టీ శ్రేణులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అధికార పార్టీ కార్యకర్తలకే అవకాశం లభించిందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇతరులకు పదవులు దక్కినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. చేవెళ్ల ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలతో పాటు ఇతర పదవుల్లోనూ పార్టీలో పనిచేసేవారికే ఎమ్మెల్యే కాలె యాదయ్య అవకాశం కల్పిస్తున్నారని స్పష్టంచేశారు. కొందరు కావాలని సొంత పార్టీ వారే లేనిపోని ఆరోపణలు చేస్తూ, గందరగోళం సృష్టించడానికి కారణమవుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

మండల అభివృద్ధి అధికారి సంధ్య



మాట్లాడుతున్న సంధ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఎక్కువగా ఉందని, గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య గ్రామ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్య ఏదైనా చిన్నగా ఉన్నప్పుడే పరిష్కార చర్యలు తీసుకోవాలని, అప్పుడే సులభతరం అవుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. మొయినాబాద్ మండలంలోని 20 గ్రామాల్లో టార్గెట్ 500 ఉండగా, ఆపైనే ఎంపిక చేసినట్లు తెలిపారు. మోడల్ ఇందిరమ్మ గ్రామం వెంకటాపూర్‌లో ఇప్పటికే ఇద్దరు లబ్ధిదారులకు బేస్మెంట్ నిర్మించుకోవడంతో వారి బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష మొదటి విడతగా ప్రభుత్వం వేసిందని పేర్కొన్నారు. ఇల్లు కట్టుకునే వారికి దశల వారీగా పథకం డబ్బులు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగానే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసంలో అర్హుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, శివకుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రమను దోచుకుంటున్న పరిశ్రమలు



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ నాయకులు

షాబాద్: వలస కార్మికుల శ్రమను చందనవెల్లి పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని సీఐటీయూ చందనవెల్లి ఇండస్ట్రీస్ కన్వీనర్ అల్లి దేవేందర్ ఆరోపించారు. శుక్రవారం షాబాద్ మండలం చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను దోచుకుంటున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కొత్త లేబర్ కోడ్స్ కారణంగా ఎనిమిది గంటల పని విధానం.. 12 గంటలకు పెరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, బ్యాంకు ఉద్యోగులు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసుగుప్తా, కుమార్ యాదవ్, ప్రకాశ్, విక్రమ్, మోసం ఖాన్ తదితరులున్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి

- జాతీయ జెండాలతో భారీ ర్యాలీ

కడ్తాల్: పాకిస్తాన్ కవ్వింపు చర్యలు మానుకోవాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హితవు పలికారు. లేని పక్షంలో అదను చూసి భారత్ కోలుకోని తీస్తుందని హెచ్చరించారు. తద్వారా దాయాది దేశం ప్రపంచ పటంలో లేకుండా పోతుందని పేర్కొన్నారు. మండల పరిధి మైసిగండి గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేతావత్ హీరాసింగ్ ఆధ్వర్యంలో, భారత్– పాక్ యుద్ధంలో అసువులు బాసిన జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌ల చిత్రపటాలకు శుక్రవారం నివాళులర్పించారు. సైన్యానికి మద్దతుగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ.. భారత్‌పై తరచూ దాడులకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాకిస్తాన్ ఇలాగే వ్యవహరిస్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దశపతిగౌడ్ నాయకులు జవహర్ లాల్, స్టాలిన్ కిషన్, తుల్సీరాం, బోనిశంకర్, కిషన్, నర్సింహగౌడ్, జగన్, ప్రవీణ్, సీతారాం, బాబూలాల్, హర్యానాయక్, పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



మొయినాబాద్: నాగిరెడ్డిగూడలో బడిబాటలో ఎంఈఓ మల్లయ్య



షాబాద్: మన్‌మర్రిలో..

- బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి
- మండల విద్యాధికారి మల్లయ్య
- బడిబాట కార్యక్రమం ప్రారంభం

మొయినాబాద్: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధి నాగిరెడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, చిన్నారులకు నాణ్యమైన విద్య అందిస్తారని తెలిపారు. తల్లి దండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. జూన్ 6 వరకు ప్రతి శుక్రవారం అన్ని గ్రామాల్లో బడిబాట కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొందుర్గు: చౌదరిగూడలో..

23 మంది చిన్నారులను చేర్పించాం

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునిత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌదరిగూడ, ఇంద్రానగర్, గుర్రంపల్లిలో పర్యటించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. శుక్రవారం మొత్తం 23 మంది చిన్నారులను బడిలో చేర్పించామని, ఇందులో 8 మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లేవారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, శంకర్, మహేశ్, కల్యాణి, శిరీష, సబిత, భానుచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా..

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని మండల పరిధి మన్‌మర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బసప్ప అన్నారు. శుక్రవారం గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠాలు బోధించి, చిన్నారులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మీమీ పిల్లలను సర్కారు బడికి పంపించాలని కోరారు.